క్లుప్తంగా

వృద్ధురాలిని ఢీ కొట్టిన లారీ



పరకాల: స్థానిక బస్టాండ్ కూడలి మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం బస్టాండ్ కూడలిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ప్రగతిసింగారం గ్రామానికి చెందిన తాళ్ల సారమ్మ (68) తన కూతురి ఇంటికెళ్లేందుకు గురువారం ఉదయం పట్టణానికి చేరుకుంది. కూరగాయాలు కొనుగోలు చేసి బస్టాండ్ మలుపు వద్ద నుంచి నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో టీఎస్03 యూసీ 3456 నంబర్ గల లారీ వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సారమ్మ కూడికాలు నుజ్జునుజ్జు అయింది. తీవ్ర రక్తస్రావంతో కొట్టుమిట్టులాడుతుండగా స్థానికులు 108తో పాటు పోలీసులకు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. డ్రైవర్ పరారీలో ఉండడంతో లారీని స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్‌లు వెల్లడించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఎమ్మెల్యే పరామర్శ



నడికూడ: మండలంలోని కంఠాత్మకూరు గ్రామానికి చెందిన సూదాటి రామారావు, తడక బాబురావు ఇటీవల మృతి చెందగా ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి బాధిత కుటుంబాలను గురువారం పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. సర్పంచ్ సతీష్, ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, సూదాటి వెంకన్న ఉన్నారు.

చర్య తీసుకోవాలి

నడికూడ: మండల కేంద్రంలోని మీసేవ నిర్వాహకుడు మొర్రి రాజేందర్ తన సెంటర్‌ను లీజుకు ఇచ్చి స్త్రీనిధిలో అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడని అతనిపై చర్య తీసుకోవాలని మండల కేంద్రానికి చెందిన వందన, శ్రీకాంత్ ప్రకటనలో కోరారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిరుద్యోగ యువకులకు మీసేవ సెంటర్‌ను కేటాయిస్తారని, ఉపాధి కోసం ఏర్పాటు చేసిన మీసేవను ఇతరులకు లీజుకు ఇచ్చి మరో ఉద్యోగం చేయడంపై అధికారులు చర్య తీసుకోవాలని కోరారు.

నియామకం

శాయంపేట : బీఆర్ఎస్ పార్టీ మండల జనరల్ సెక్రటరీగా బొమ్మెన రమేష్ నియామకం అయ్యారు. ఈ మేరకు ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి గురువారం నియామకపత్రం అందించారు. పార్టీ కోసం పనిచేసి గెలుపునకు కృషి చేయాలని సూచించారు. తన నియమాకినిక కృషి చేసిన జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతికి, నాయకుల రమేష్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు.

'చల్లా' హ్యాట్రిక్ ఖాయం



ఆత్మకూరు: రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గెలుపొంది హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని మాజీ ఏఎంసీ చైర్మన్ కాంతాల కేశవరెడ్డి అన్నారు. మండలంలోని నాగయ్యపల్లెలో గురువారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో అభివృద్ధి పనులను చేపట్టి ప్రజలకు సౌకర్యాలు కల్పించిన ధర్మారెడ్డిని మళ్లీ గెలిపించాలని ప్రజలను కోరారు. సర్పంచ్ రజిత, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు పోగుల సురేందర్, గుండాల వీరన్న, పోగుల రవీందర్ పాల్గొన్నారు.

కల్నల్ రాజేష్‌కు సన్మానం

హన్మకొండ అర్బన్: 8వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న కల్నల్ రాజేష్ కౌశిక్ బదిలీపై నైనిటాల్‌కు వెళ్తున్న సందర్భంగా ప్రభుత్వ పింగిళి మహిళా కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చంద్రమౌళి మాట్లాడుతూ 8వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ రాజేష్ కౌశిక్ మూడేళ్లుగా ఎన్‌సీసీ గర్ల్స్ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్‌గా అనేక మంది మహిళా కేడెట్లకు శిక్షణ ఇచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, డాక్టర్ సురేష్‌బాబు, సూపరింటెండెంట్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో కామర్స్ అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న గాదె నాగేశ్వర్‌రావు.. ఈనెల 9న గుండెపోటుతో అకాల మరణం చెందారు. దీంతో కేయూ పరిధిలో సహచర కామర్స్ అధ్యాపకులంతా కలిసి బాధిత కుటుంబానికి గురువారం ఆర్థిక సాయం అందజేశారు. యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కామర్స్ అధ్యాపకుడు డాక్టర్ మాదాసి కనకయ్య, పెండ్యాల సురేష్ ఆధ్వర్యంలో రూ.72,500 విలువగల చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఊపందుకున్న వరికోతలు

- 6,421 హెక్టార్లలో వరి పంట సాగు
- వరికోత యంత్రాలకు పెరిగిన డిమాండ్



మండల కేంద్రంలోని పొలంలో వరికోస్తున్న హార్వెస్టర్

ఎల్కతుర్తి : ఆరుగాలం శ్రమించి రైతులు పండించిన పంటలు ప్రస్తుతం చేతికందే దశలో ఉన్నాయి. ముందస్తుగా వేసిన పంటలు ఇప్పటికే కోతల దశకు చేరుకున్నాయి. దీంతో రైతులు వరికోతకు సన్నద్ధం అవుతున్నారు. మండల కేంద్రంలో వరి కోతలు ప్రారంభం కాగా వరి కోత యంత్రాలకు మండల వ్యాప్తంగా మంచి డిమాండ్ పెరిగింది.

6,421 హెక్టార్లలో వరి పంట..

మండలంలో మొత్తం 8,800 హెక్టార్లు సాగు విస్తీర్ణం ఉండగా, ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో మండల వ్యాప్తంగా 6,421 హెక్టార్లలో సాగు అయినట్లు వ్యవసాయ అధికారులు వెల్లడించారు. అందులో 1,615 హెక్టార్లు పత్తి పంటను సాగు చేయగా మిగతా హెక్టార్లలో ఇతర పంటలను సాగు చేసినట్లు తెలిపారు. అయితే ఈ ఖరీఫ్ సీజన్‌లో కొందరు రైతులు ముందస్తుగా నాటు వేయగా మరి కొంత మంది రైతులు కాస్త ఆలస్యంగా వేశారు. దీంతో ముందస్తుగా నాటు వేసిన పంట పొలాలు ప్రస్తుతం కోత దశకు వచ్చాయి.

ప్రారంభమైన కోతలు..

మండల వ్యాప్తంగా వరికోతలు ప్రారంభమయ్యాయి. రైతులు పంటపొలాల్లో బీజీబీజీగా గడుపుతున్నారు. వీలైనంత త్వరగా కోతలు పూర్తి చేసి ధాన్యాన్ని ఇళ్లకు తరలించుకోవాలని వరి కోత యంత్రాల కోసం పడిగాపులు కాస్తున్నారు. మండలంలో మొత్తం 19గ్రామ పంచాయతీలకు గాను మరో 4అనుబంధ గ్రామాలు ఉన్నాయి. ఈ సారి రైతులు పెద్ద ఎత్తున వరి పంటలతో పాటు పత్తి, మొక్కజొన్న పంటలను సాగుచేశారు. కాగా పత్తి పంట ప్రస్తుతం ఇంకా పూతదశలోనే ఉండగా, వరి పంటపైన్నే రైతులు ఎక్కువ ఆశలు పెట్టుకున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు ముందస్తుగా వరి పంటలను సగానికి పైగా సాగుచేయగా పంటలు ప్రస్తుతం కోత దశకు వచ్చాయి. వాటిని కోసి ఇళ్లకు తరలించేందుకు రైతులు ఆత్రుత పడుతున్నారు. దీంతో మండలంలో వరి కోతలు ప్రారంభమై ఊపందుకున్నాయి.

వరికోత యంత్రాలకు పెరిగిన డిమాండ్..

ముందస్తుగా వేసిన వరిపంటను కోసేందుకు ఓ వైపు రైతులు సిద్ధమవుతుండగా వరికోత యంత్రాల డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం ఎకరాకు రూ. 2వేల నుంచి రూ. 2500 వరకు, చైన్ మిషన్‌కు రూ.3000 నుంచి రూ. 3500 వరకు డిమాండ్‌ను బట్టి మరింత ఎక్కువ మొత్తానికి కోతలు చేపడుతున్నారు. అయితే ఎంతో కష్టనష్టాలతో సాగు చేసిన పంటలు విపత్తు రాకముందే ఇళ్లకు చేర్చాలని రైతులు భావిస్తుండగా వరికోత యంత్రాల డిమాండ్ మూలంగా రోజుల తరబడి ఆలస్యం అవుతూనే ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతోపాటు వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులు రైతులకు ఒకింత టెన్షన్ పెడుతున్నాయి.



కోత దశకు వచ్చిన పొలం

రోడ్డు వెడల్పు పనుల్లో రచ్చ

- గొడవకు దిగిన ఇంటి యజమానులు



కాంట్రాక్టర్‌తో గొడవకు దిగిన గ్రామస్తులు

వేలేరు : మండల కేంద్రంలో చేపడుతున్న రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా ఇళ్లు కోల్పోతున్న ఇంటి యజమానులు గొడవకు దిగారు. తమ ఇళ్లు కూలగొట్టి, కొందరు ఇళ్లలను వదిలేసి పక్కన నుంచి విస్తరణ పనులు చేపట్టడం ఏంటని ప్రశ్నించారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులకు కొందరు వ్యక్తులు ఆటకం కలిగించి వారి ఇంటి ఎదుట రోడ్డు పనులు నిలిపివేశారు. ఈ క్రమంలో గమనించిన గ్రామస్తులు రోడ్డు వెడల్పు అందరికి అవసరమని, తమ ఇళ్లను కూలగొట్టిన మాదిరిగానే రోడ్డుకు అడ్డుగా వస్తున్న ఇళ్లను కూడా కూలగొట్టాలని సంబంధిత కాంట్రాక్టర్‌తో గొడవకు దిగి పనులను అడ్డుకున్నారు. వెంటనే స్పందించిన సర్పంచ్ మాధవరెడ్డి పనులను అడ్డుకున్న ఇంటి యజమానులతో మాట్లాడారు. 50 ఫీట్ల రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించనున్నట్లు కొన్ని రోజుల క్రితం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో తెలిపినప్పటికీ ఎందుకు స్పందించలేదని యజమానులను ప్రశ్నించారు. గ్రామపంచాయతీలో అందరూ సమానమేనని తెలిపారు. ఇళ్లను ఖాళీ చేసేందుకు ఐదు రోజుల గడువు కావాలని సదరు ఇంటియజమానులు కోరగా చివరి అవకాశం ఇస్తున్నామని సర్పంచ్ సూచించారు. రోడ్డు వెడల్పు పనులకు అందరూ సహకరించాలని సర్పంచ్ కోరారు. సమస్య ఉంటే సంప్రదించాలన్నారు.

పత్తి సాగులో మెళకువలు పాటించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న అనిల్

కమలాపూర్: మండలంలోని రైతులు పత్తిసాగులో అధిక దిగుబడుల పొందేందుకు మెళకువలు పాటించాలని బీసీఐ ప్రాజెక్ట్ సమన్వయకర్త కంచ అనిల్ అన్నారు. మండలంలోని పంగిడిపల్లి అనుబంధ గ్రామం ధర్మనగర్‌లో కేశవాపూర్ (ఎఫ్‌పీసీఎల్) భారత సుస్థిర యాజమాన్య పథకం ఆధ్వర్యంలో గురువారం పత్తి పంట క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పత్తి సేకరణ సమయంలో కాటన్ సంచుల్లో పత్తి తీయాలని, నూలు, దారం, తల వెంట్రుకలు, చెత్తా చెదారం రాకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. అదే విధంగా బాలకార్మిక నిరోధక చట్టం ప్రకారం 14 ఏళ్లలోపు పిల్లలతో వ్యవసాయ, ఇతరత్రా పనులు చేయించవద్దన్నారు. బాలకార్మిక చట్టాన్ని ఉల్లంఘించవద్దని, రైతులు తమకు పనికొచ్చే కూలీల పట్ల వివక్ష చూపరాదని, కనీస వేతన చట్టం ప్రకారం కూలి డబ్బులు ఇవ్వాలని రైతులకు సూచించారు. అంతర్జాతీయ కార్మిక సంఘం నిబంధనల మేరకు వ్యవసాయ పనుల్లో తమ పిల్లలను భాగస్వాములు చేయడం అపాయకరమని, రసాయనాల వినియోగం పిల్లల ఆరోగ్యపై దీర్ఘకాలికంగా దుష్ప్రభావాలు చూపుతుందన్నారు. రైతులు సర్దన స్వామి, లావణ్య, తరిగొప్పుల సుమలత, నెల్లుట్ల పుష్ప, జయేంద్ర, మమత, కనుకలక్ష్మి, మల్లక్క, మణెక్క, రైతు కూలీలు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి



పోలింగ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఏసీపీ కిషోర్‌కుమార్

ఆత్మకూరు: ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని ఏసీపీ కిషోర్‌కుమార్ కోరారు. మండలంలోని నీరుకుళ్లలోని క్రిటికల్ పోలింగ్ స్టేషన్‌లను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసీపీ వివిధ రాజకీయ పార్టీల నాయకులకు ఎన్నికల నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. గొడవలు, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడి కేసులపాలు కావద్దని సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ రవిరాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

దసరా వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి



ముస్త్యాలపల్లి సర్పంచ్‌తో మాట్లాడుతున్న ఎస్సై

దామెర: మండలంలో దసరా వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్సై ముత్యం రాజేందర్ అన్నారు. మండలంలోని ముస్త్యాలపల్లిలో గురువారం ఆయన గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ నెల 22, 23వ తేదీల్లో సద్దుల బతుకమ్మ, దసరా పండుగను సంతోషాల మధ్య జరుపుకోవాలన్నారు. మద్యం సేవించి వేడుకల్లో పాల్గొనవద్దని సూచించారు. గొడవలకు పాల్పడినా, ప్రోత్సహించినా వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సర్పంచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- ఎమ్మెల్యే సతీష్‌కుమార్




కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సతీష్

ఎల్కతుర్తి: రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని స్థానిక ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ అన్నారు. మండలంలోని సూరారం గ్రామానికి చెందిన పలువురు యువకులు గురువారం బీఆర్ఎస్‌లో చేరగా ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరడం హర్షనీయమన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా యువత, నాయకులు సైనికుల్లా పనిచేయాలని కోరారు. పార్టీలో చేరిన వారు తక్కళ్లపల్లి వినయ్‌రావు, పొలాటి వినయ్‌రావు, బచ్చు ప్రశాంత్‌రావు, మేకల కృష్ణసాయి, బచ్చు అరుణ్‌రావు, మన్విత్‌రావు తదితరులు ఉన్నారు. ఎంపీపీ మేకల స్వప్న, వైస్ ఎంపీపీ నగేష్, సింగిల్‌విండో చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్, సర్పంచ్ కుర్ర సాంబమూర్తి, మండల అధ్యక్షుడు సమ్మయ్యగౌడ్ పాల్గొన్నారు.


స్కందమాత అలంకరణలో దుర్గామాత



వేలేరు : అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



శాయంపేట : పూజల్లో పాల్గొన్న ఎస్సై దేవేందర్



ఆత్మకూరు : స్కంద మాత అలంకరణలో..

ఆత్మకూరు: మండల కేంద్రంలో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం వైభవంగా కొనసాగుతున్నాయి. స్కందమాత అలంకరణలో దుర్గామాత భక్తులకు దర్శనమిచ్చింది. అలాగే రేమిడి స్రవంతి, మల్లారెడ్డి దంపతులు అన్నదానం నిర్వహించారు. గ్రామంలోని భక్తులు అధిక సంఖ్యంలో పాల్గొని దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వారికి తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు అందించారు. దుర్గాదేవి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని భక్తులు కోరారు.

వేలేరు : మండల వ్యాప్తంగా దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. వేలేరు మండల కేంద్రంలోని అమ్మాభవాని యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి గురువారం శ్రీలలిత త్రిపురసుందరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. భక్తులు ప్రతేక పూజల అనంతరం పిట్టల జిడయ్య-జయమ్మ దంపతులు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా దాతలు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీర్వాదాలు పొందారు. ఈ కార్యక్రమంలో పిట్టల రాజు, శ్రీకాంత్, సురేష్, తిరుపతి, రమేష్, పవన్, రాజు, శ్రీనివాస్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక రాజరాజేశ్వర దేవస్థానం, మండల కేంద్రంలోని శివమార్కండేయ ఆలయంలో ఎస్‌పీటీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. గురువారం లలితాత్రిపురసుందరి దేవిగా దుర్గామాత భక్తులకు దర్శనమిచ్చింది. ఆలయ అర్చకులు అనుదీప్‌శర్మ, రాజ్‌కుమార్‌లు అభిషేకాలు, కుంకుమార్చన, చండీ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై దేవేందర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రభుత్వ పథకాలను ఇంటింటికి తీసుకెళ్లాలి

కరీమాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతీ ఇంటికి తీసుకెళ్లాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేష్ అన్నారు. 43వ డివిజన్ సమన్వయ కమిటీ సభ్యులు, గ్రామ శాఖ అధ్యక్షులు, ముఖ్య నాయకులతో మామునూరులో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు నల్లేరుపై నడకే అని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో 43వ డివిజన్ కార్పొరేటర్ ఈదురు అరుణతోపాటు నాయకులు పాల్గొన్నారు. అలాగే, దసరా పండుగను పురస్కరించుకుని జక్కలొద్దిలో నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలను ఎమ్మెల్యే రమేష్ ప్రారంభించారు. 43, 44వ డివిజన్ జక్కలొద్ది, తిమ్మాపురం గ్రామాలకు చెందిన కుమ్మరి చెన్నమ్మ, కొమురయ్య, ఐలయ్య, బండి ఎల్లయ్యలు ఇటీవల అనారోగ్యాలతో మరణించగా, వారి కుటుంబాలను పరామర్శించారు.

విద్యార్థులను విస్మరించిన బీఆర్ఎస్

హన్మకొండ అర్బన్: బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థులను విస్మరించిందని, ఇటీవల బీఆర్ఎస్ పార్టీ ప్రకటించిన మేనిఫెస్టోలో విద్యార్థులు, నిరుద్యోగులు, యువకులకు సంబంధించి కనీస హామీ లేకపోవడంతో శోచనీయమని బీఎస్పీ వరంగల్ రీజియన్ సెక్రటరీ కన్నం సునీల్ విమర్శించారు. బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన బీఎస్పీ గ్రేటర్ వరంగల్ నగర కమిటీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేపర్ లీకేజీ, ఇతరత్రా కారణాలతో నియామకాలు చేపట్టకపోవడంతో నిరుద్యోగుల ఆశలు అడియాశలు అయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్.. నిరుద్యోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. బీఎస్పీ గ్రేటర్ వరంగల్ నగర కమిటీ అధ్యక్షుడు వేల్పుల శంకర్, ఉపాధ్యక్షుడు ధనరాజ్, అధికార ప్రతినిధి మార్క రాహుల్, జనరల్ సెక్రటరీ కందుకూరి యువకిషోర్, సెక్రటరీ మామిడి నాగరాజు, శ్రీను పాల్గొన్నారు.

గోవుల సంరక్షణతోనే రైతుల మనుగడ



దూడలను అందజేస్తున్న మహేష్ అగర్వాల్

వేలేరు : గోవుల సంరక్షణతోనే రైతుల మనుగడని తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ అన్నారు. మండలంలోని లోక్యతండా గ్రామంలో గురువారం శివశంకర్ గోశాల ఆధ్వర్యంలో 10 మంది రైతులకు ఉచితంగా 20 లేగదూడలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గో సంపద రోజురోజుకు తగ్గిపోతుందన్నారు. దీంతో రైతులకు కూడా ఇబ్బందేనని, అధిక రసాయన ఎరువుల వాడకంతో భూసారం, పంట దిగుబడి తగ్గుతుందన్నారు. సేంద్రియ వ్యవసాయంతో ఆరోగ్యవంతమైన సమాజం తయారవుతుందని అన్నారు. ప్రతిఒక్కరు గోవులను సంరక్షించాలన్నారు. సర్పంచ్ మురావత్ అనురాధలింగం, గోశాల సూపరిండెంట్ దుర్గం రోజా, సుధాకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ముల్కనూరులో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ సాయిగార్డెన్‌లో గురువారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. ముల్కనూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో 1993-94 సంవత్సరంలో పదోతరగతి చదువుకున్న విద్యార్థులు 30 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకొని అప్యాయంగా పలకరించుకున్నారు. అలనాటి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం అప్పటి గురువులు కోడూరి సరోజన, సుదర్శన్‌రెడ్డి, కృష్ణమూర్తి, రాము, లక్ష్మయ్యలను శాలువాతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందించారు. కమీడియన్ మహేష్ హాస్యాతనం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకానికి నర్సరీలు సిద్ధం చేయాలి



నర్సరీలోని మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ బాబు, పంచాయతీ కార్యదర్శులు

కమలాపూర్: మొక్కల పెంపకానికి అనువుగా నర్సరీలను సిద్ధం చేయాలని ఎంపీడీఓ గుండె బాబు అన్నారు. మండలంలోని లక్ష్మీపూర్, వంగపల్లి గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించి నర్సరీలను పరిశీలించారు. లక్ష్మీపూర్ నర్సరీలో గతేడాది మిగిలిపోయిన పొడవైన చెట్లను ఎత్తుల వారిగా వరుస క్రమంలో అమర్చి నర్సరీని మొక్కల పెంపకానికి సిద్ధం చేయాలన్నారు. వంగపల్లిలో నర్సరీని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అన్నారు. మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించే విధంగా ప్రతిఒక్కరికీ అవగాహన కల్పించాలని సూచించారు. ఈజీఎస్ ఏపీఓ రమేష్, ఈసీ కార్తీక్, కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త బైక్ కొనాలనే ఆశ తీరకముందే..

- రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



నాగూర్ వలీ ఫైల్

శాయంపేట : కష్టపడి సంపాదించిన డబ్బుతో కొత్త బైక్ కొనుగోలు చేయాలనే ఆశ తీరముందే మృత్యువాడిలోకి వెళ్లాడు ఆ యువకుడు. కాలినడకన వెళ్తున్న అతడిని కారు మృత్యు రూపంలో వచ్చి కబలించింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ..గ్రామానికి చెందిన షేక్ చిన్న సుభాని-బాజీ దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడు నాగూర్ వలీ(23) స్థానిక ఎయిర్‌టెల్ డిస్ట్రిబ్యూషన్‌లో సెల్స్ ఎగ్జిక్యూటివ్‌గా నాలుగేళ్ల నుంచి పనిచేస్తున్నాడు. గురువారం విధులు ముగించుకున్న అతను కొత్త బైక్ కొనుగోలు చేసేందుకు ఎయిర్టెల్ పీఎస్ఎం రవికాంత్‌తో కలిసి మాందారిపేటకు నడుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో మాందారిపేట వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి నాగూర్ వలీని వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో అతను గాలిలోకి ఎగిరిపడ్డాడు. గమనించిన స్థానికులు కారును పట్టుకునే ప్రయత్నం చేయగా వేగంతో కారునడుపుతూ పరారయ్యాడు. గాయపడిన యువకుడిని తరలించేందుకు 108కు ఫోన్ చేయగా ఆలస్యమవ్వడంతో పక్కనేఉన్న ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక వైద్యం అందించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ నాగూర్ వలీ మృతి చెందాడు. దీంతో పలువురు కన్నీరు పెట్టారు.

ఎమ్మెల్యే రాజయ్య వాహనం తనిఖీ



ఎమ్మెల్యే రాజయ్య వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

వేలేరు : రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో స్థానిక పోలీసులు మండల వ్యాప్తంగా ముమ్మర తనిఖీలు చేపట్టారు. పీచర నుంచి హనుమకొండ వైపునకు వెళ్తున్న స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే రాజయ్య తాటికొండ వాహనాన్ని సోడాషపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఎస్సై హరిత గురువారం క్షుణ్ణంగా తనిఖీ చేశారు.